నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

ఖిల్లా, జనవరి 18: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం జడ్పీ చైర్మన్ విఠల్‌రావు అధ్యక్షతన జరగనుంది. ఈ సమావేశంలో 2024-25 గ్రామ, మండల, జిల్లా బడ్జెట్‌పై చర్చించనున్నారు. తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపించనున్నారు. సమావేశానికి రాజ్యసభ సభ్యులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జడ్పీటీసీలు, జిల్లా అధికారులు పాల్గొననున్నారు. శాసనసభ ఎన్నికల తర్వాత నిర్వహిస్తున్న ఈ సమావేశానికి కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు.

'పార్లమెంట్'పై ప్రధాన పార్టీల నజర్







- ఎంపీ ఎన్నికలపై మూడు పార్టీల దృష్టి
- ఇప్పటి నుంచే ఎన్నికల కోసం కసరత్తు చేస్తున్న నేతలు
- మరోదఫా బీజేపీ నుంచి పోటీకి సన్నద్ధమవుతున్న ఎంపీ అర్వింద్
- ఎన్నికలపై కొనసాగుతున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నేతల సమీక్షలు

నిజామాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల కోసం మూడు ప్రధాన పార్టీల నేతలు సన్నద్ధమవుతున్నారు. ఈ దఫా త్రిముఖ పోటీ ఉండనుండటంతో ఇప్పటి నుంచే గట్టి ప్రయత్నాలను మొదలు పెట్టారు. నియోజకవర్గాల్లో పరిస్థితులను అంచనా వేస్తూ కార్యక్రమాలను చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. కార్యకర్తలు సీనియర్ నేతలతో సమన్వయం సమావేశాలను నిర్వహిస్తూ పోటీకి ప్రయత్నాలను చేస్తున్నారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు శాసనసభ నియోజకవర్గాల పరిధిలో పార్టీల బలాబలాలను అంచనా వేస్తూ సామాజిక వర్గాల వారీగా అభ్యర్థులను బరిలో దించేందుకు పార్టీల నేతలు సిద్ధమవుతున్నారు. పోటీకి ప్రయత్నాలు చేస్తున్న నేతలు కూడా ఆయా పార్టీలకు చెందిన సీనియర్ నేతలు, రాష్ట్ర ఇన్‌చార్జిలు, అధ్యక్షులను కలుస్తూ తమకు అవకాశాలను ఇవ్వాలని కోరుతున్నారు.

రసవత్తరంగా మారనున్న ఎన్నికలు

నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఈసారి జరిగే ఎన్నికలు రసవత్తరంగా మారనున్నాయి. పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజకవర్గాలు ఉండగా శాసనసభ ఎన్నికల్లో విభిన్న ఫలితాలు వచ్చాయి. మూడు పార్టీలకు ప్రజలు పార్లమెంట్ పరిధిలో అవకాశాలు ఇచ్చారు. ఏ పార్టీకి మొత్తం స్థానాలను కట్టబెట్టలేదు. గత పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఏడు శాసనసభ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉండగా ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. పార్లమెంట్ పరిధిలోని నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ నియోజకవర్గం పరిధిలో బీజేపీ ఎమ్మెల్యేలు ఉండగా బోధన్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. బాల్కొండ, కొరుట్ల, జగిత్యాలలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. శాసనసభ ఎన్నికల్లో ఏడు నియోజకవర్గాల పరిధిలో బీఆర్ఎస్‌కు 4లక్షల 23వేల 957 ఓట్లు రాగా, బీజేపీకి 3లక్షల 65వేల 374 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్‌కు 3లక్షల 23వేల 236 ఓట్లు పార్లమెంట్ పరిధిలో వచ్చాయి. మూడు పార్టీలకు నియోజకవర్గ ప్రజలు అవకాశం ఇచ్చారు. శాసనసభ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో ప్రభుత్వం మారడం కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో రాజకీయ పరిస్థితి కూడా ప్రస్తుతం మారాయి. నేతలు కూడా విభిన్న పార్టీలకు మారుతుండటంతో రాజకీయం కూడా వేగంగా పార్లమెంట్ పరిధిలో మారుతోంది. సామాజిక సమీకరణాలతో పాటు సీనియర్ నేతలు కూడా ఇతర పార్టీల్లో చేరుతుండటంతో పార్లమెంట్ ఎన్నికల్లో ఊహించని విధంగా ఫలితాలు మారే అవకాశం ఉండటంతో పోటీకి సన్నద్ధమవుతున్న నేతలు ముందస్తుగానే అన్ని వివరాలను సేకరించుకుంటూ రంగంలోకి దిగుతున్నారు.

మరో దఫా పోటీకి ఎంపీ అర్వింద్

నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ప్రస్తుతం సిట్టింగ్ ఎంపీగా బీజేపీ నుంచి ధర్మపురి అర్వింద్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయన మరో దఫా పోటీకి సన్నద్ధమవుతున్నారు. గడిచిన కొన్ని రోజులుగా పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో జరుగుతున్న కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. వికసిత్ భారత్ కార్యక్రమాలతో పాటు ఇతర కార్యక్రమాలన్నీ నిర్వహిస్తున్నారు. మరోదఫా పోటీ కోసం ఆయన సన్నద్ధమవుతున్నారు. శాసనసభ ఎన్నికల్లో కొరుట్ల నుంచి పోటీ చేసి ఓటమిపాలైన ఆయన ఏడు నియోజకవర్గాల పరిధిలో బీజేపీ మెరుగైన ఫలితాలు సాధించడంతో మరోదఫా తనకు అవకాశం వస్తుందని భావిస్తున్నారు. పార్లమెంట్ నియోజకవర్గంలో పరిస్థితులను అంచనా వేయడంతో పాటు తనకు కలిసివచ్చిన పసుపుబోర్డు అంశాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్‌లోపే పసుపు బోర్డుకు సంబంధించిన కొన్ని కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లను చేసుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం పూర్తి చేయడంతో పాటు కొత్త వాటిని శంకుస్థాపన చేసేందుకు ప్రయత్నాలను చేస్తున్నారు. కొంత మంది సీనియర్ నేతలతో విబేదాలు ఉన్న యూత్‌ను టార్గెట్ చేస్తూ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. పూర్తిస్థాయిలో ఎన్నికలకు సన్నద్ధమవుతూ తన ప్రయత్నాలను చేస్తున్నారు. ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, జాతీయ అధ్యక్షుడు నడ్డాను కలుస్తూ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. సిట్టింగ్‌లకే దాదాపు అవకాశం ఉండటంతో ముందస్తు ఏర్పాట్లను చేసుకుంటున్నారు. బీజేపీ పార్లమెంట్ పరిధిలో పుంజుకోవడంతో జిల్లాకు చెందిన కొంత మంది నేతలు ఎంపీగా పోటీ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్న అవకాశాలు ఆయనకే మెండుగా ఉండటంతో కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు.

ఫలితాలపై బీఆర్ఎస్ సమీక్షలు

శాసనసభ ఎన్నికల్లో పార్లమెంట్ పరిధిలో ఏడింటిలో మూడింటిని నిలబెట్టుకొని నాలుగింటిలో ఓటమిపాలైన బీఆర్ఎస్ పార్టీ నేతలు ఫలితాలపై సమీక్షలు నిర్వహించారు. పార్లమెంట్ పరిధి సమావేశాన్ని వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో నిర్వహించడంతో పాటు పరిస్థితులను చర్చించారు. ఓటమిపై గల కారణాలను వివరించడంతో పాటు పార్లమెంట్ స్థానాన్ని నిలబెట్టుకునేందుకు గట్టి ప్రయత్నాలను చేపట్టాలని నిర్ణయించారు. ఏడు నియోజకవర్గాల పరిధిలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు నేతలను సమన్వయ పరిచి కార్యక్రమాలను నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ దఫా ఎంపీగా ఎమ్మెల్సీ కవితనే పోటీకి సిద్ధమవుతుండటంతో పార్టీ సీనియర్ నేతలు కార్యక్రమాలను చేపడుతున్నారు. పార్టీకి పార్లమెంట్ ఎన్నికలు కీలకం కావడం పాత స్థానాలను నిలబెట్టుకోవడం అవసరం కావడంతో అన్ని పరిశీలించడంతో పాటు గ్రామ స్థాయి నుంచి నేతల ను కలుపుకొని వెళ్లేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ నెలా ఖరులోపు మండల, నియోజకవర్గాల వారీగా సమావేశాల ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నియోజకవర్గం పరిధిలో ముగ్గురు ఎమ్మెల్యేలు ఉండటం వల్ల ఈ దఫా ఎలాగైనా అవకాశాన్ని వదులుకోవద్దని ఏర్పాట్లను చేసుకుంటున్నారు. ఒకవేళ ఎమ్మెల్సీ కవిత పోటీ చేయకుంటే ఇతర బలమైన నేతలను బరిలోకి దించేందుకు ముందస్తుగానే గట్టి ప్రయత్నాలను చేస్తున్నట్లు తెలుస్తోంది.

బలమైన వ్యక్తిని బరిలో దించేందుకు కాంగ్రెస్ కసరత్తు

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నేతలు ఈ దఫా నిజామాబాద్ పార్లమెంట్ స్థానాన్ని నిలబెట్టుకునేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. పదేళ్లుగా కాంగ్రెస్‌కు అవకాశం లేకపోవడంతో ఈ దఫా బలమైన వ్యక్తిని బరిలోకి దించేందుకు సన్నద్ధమవుతున్నారు. నియోజకవర్గం పరిధిలో ఇద్దరు ఎమ్మెల్యేలు ఉండటంతో పాటు మిగతా నియోజకవర్గాల్లో గణనీయంగా ఓట్లను శాసనసభ ఎన్నికల్లో సాధించడంతో ఈ దఫా అవకాశం వస్తుందని భావిస్తున్నారు. పార్టీ అధికారంలో ఉండటం వల్ల ప్రజలు కూడా మద్దతు ఇస్తారని అంచనా వేస్తూ సామాజిక సమీకరణాల ఆధారంగా బలమైన నేతను అభ్యర్థిగా దించేందుకు సన్నద్ధమవుతున్నారు. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడు శాసనసభ నియోజకవర్గాల్లో ఉన్న ఓటర్ల జాబితాను పరిశీలించడంతో పాటు ఏ వర్గం ఓట్లు ఎక్కువగా ఉన్నాయో చూస్తున్నారు. ఆ వర్గం అభ్యర్థినే బరిలో దించేందుకు సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో మెజార్టీ స్థానాలపై దృష్టి పెట్టిన కాంగ్రెస్ అగ్రనాయకత్వం ఈ దఫా గెలిచే అభ్యర్థులకే టికెట్‌లను ఇవ్వనున్నారు. ఇప్పటికే నియోజకవర్గ ఇన్‌చార్జిలను నియమించడంతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షించడంతో పార్లమెంట్ పైన ఒక అంచనాకు వచ్చారు. ఏడు నియోజకవర్గాల పరిధిలో పరిచయం ఉన్న నేతలను దింపేందుకు సన్నద్ధమవుతున్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉండటంతో నిజామాబాద్ నుంచి పోటీ కోసం పలువురు నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఎన్టీఆర్ యుగపురుషుడు

- ఎన్టీఆర్ వర్ధంతిలో మాజీ మంత్రి మండవ

డిచ్‌పల్లి, జనవరి 18: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు యుగపురుషుడని, తెలుగుజాతి కీర్తిని ఉన్నత స్థాయిలో నిలబెట్టిన మహనీయుడు తెలుగు జాతి ముద్దు బిడ్డ అని మాజీ మంత్రి, కాంగ్రెస్ నాయకుడు మండవ వెంకటేశ్వరరావు అన్నారు. ఎన్టీఆర్ 28వ వర్ధంతి సందర్భంగా గురువారం ఆయన ధర్మారం(బి)లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మండవ ఎన్టీఆర్ తెలుగు రాష్ట్రాలకు చేసిన సేవలను కొనియాడారు. రామారావు జానపద చిత్రాలతో పాటు సాంఘిక చిత్రాల్లో రాణించి తెలుగు ప్రజల్లో వెలుగునింపారని అన్నారు. అవినీతికి దూరంగా నిజాయితీకి మారుపేరున్న ఎన్టీఆర్ చదువుతున్న రోజుల్లోనే శ్రమజీవుల జీవితాలపై రిక్షా కార్మికుడు చిత్రాలు తీసి ప్రజల మెప్పు పొందారన్నారు. తెలుగు వారి గొంతును ఢిల్లీ పీఠం వరకు వినిపించేలా పార్టీని స్థాపించి కేవలం తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి తీసుకొచ్చి చరిత్ర సృష్టించారన్నారు. ఆ రోజుల్లోనే ఎమ్మెల్యేలకు శిక్షణ తరగతులు నిర్వహించి రాజకీయ ఓనమాలు నేర్పారన్నారు. అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటు కోసం ప్రత్యేక చొరవ చూపిన మహనీయుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. ఆస్ట్రేలియ, కెనడా, కువైట్ దేశాల్లో కూడా ఎన్టీఆర్ తన చెరగని ముద్ర వేసుకున్నారని అన్నారు. ఎన్టీఆర్‌తో తనకు ఎంతో వ్యక్తిగతంగా అనుబంధం ఉండేదని ఆయన జ్ఞాపకాలు చిరకాలం మదిలో మెదులుతూ ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ అభిమానులు కస్తూరి పిచ్చేశ్వరరావు, రావుల బ్రహ్మానందం, నాయుడు ఆంజనేయులు, వేముల పల్లి గోపి, వెంకయ్య చౌదరి, పున్న రావు, మురారి, సుబ్బరావు, రామకృష్ణ, శ్రీనివాసరావు, వాసుబాబు, నరేశ్, సోమ్‌నాథ్, తదితరులు ఉన్నారు.



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి మండవ



పార్టీ సీనియర్ నేతలతో కలిసి నామినేషన్ వేస్తున్న మహేష్‌కుమార్ గౌడ్

ఎమ్మెల్సీగా మహేష్‌కుమార్ గౌడ్ నామినేషన

- జిల్లా నుంచి తరలివెళ్లిన పార్టీ సీనియర్ నేతలు

నిజామాబాద్ అర్బన్, జనవరి 18: జిల్లా నుంచి కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్సీగా టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. తన నామినేషన్ పత్రాలను శాసన సభ కార్యదర్శికి అందించారు. నామినేషన్ సందర్భంగా ఆయన వెంట ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేతలు హన్మంత్‌రావు, యాదవ్‌లు వెంట రాగా ఆయన ఈ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఒక సెట్ వీరితో వేయగా మరో సెట్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యే మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్, మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డిలతో పాటు ఇతర నేతలతో కలిసి అందించారు. మహేష్‌కుమార్‌గౌడ్ నామినేషన్ సందర్భంగా జిల్లాకు చెందిన సీనియర్ నేతలు తరలివెళ్లారు. మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, మాజీ ప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డితో కలిసి మహేష్‌కుమార్ గౌడ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అంతిరెడ్డి ప్రధాన కార్యదర్శి గంగారెడ్డితో పాటు ఇతర నేతలు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్



కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కమ్మర్‌పల్లి, జనవరి 18: కేంద్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. గురువారం మండలంలోని హసాకొత్తూర్‌లో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమపథకాలను వందశాతం లబ్ధిదారులకు అందించడమే లక్ష్యంగా వికసిత్ భారత్ సంకల్ప యాత్ర చేపట్టడం జరిగిందన్నారు. అర్హులైన వారందరు కేంద్ర ప్రభుత్వ పథకాలకోసం దరకాస్తు చేసుకోవాలన్నారు. ప్రధానమంత్రి ఆవాజ్ యోజన పథకంలో అర్హులైన వారందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. ఆయుస్మాన్ భారత్ పథకం ద్వారా 5లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమా వర్తిస్తుందని ఇది నిరుపేదలకు వరంలాంటిదన్నారు. అర్హులైన వారందరికీ ఉజ్వల పథకం ద్వారా గ్యాస్ సిలిండర్లు కేంద్రప్రభుత్వం అందజేస్తుందన్నారు. అధికారులు కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అన్ని వార్గవారికి పథకాలు అందేవిదంగా ప్రత్యేక చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి యెహాన్, ఎంపీడీవో టి సంతోష్ రెడ్డి, తహసీల్దార్ ఆంజనేయులు, ఏడీఏ మల్లయ్య, చౌట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు సుప్రియ, ఏపీఎం గంగారెడ్డి, యూనియన్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, సర్పంచ్ ఏనుగు పద్మ రాజేశ్వర్ పాల్గొన్నారు. అనంతరం మోదీ క్యాలండర్‌ను అధికారులు, బీజేపీ నాయకులతో కలిసి ఎంపీ ఆవిష్కరించారు.

ఎన్నికల తర్వాత దేశంలో రామరాజ్యం : ఎంపీ

నిజామాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల తర్వాత దేశంలో రామరాజ్యం వస్తుందని, హిందువులంతా ఐక్యం కావాలని ఎంపీ అర్వింద్ అన్నారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. అయోధ్య వివాదానికి కాంగ్రెస్ పార్టీయే కారణమని, రాహుల్ గాంధీ, సోనియా గాంధీలు 'జై శ్రీరాం' అంటే తాము వద్దన్నామా అని ఆయన ప్రశ్నించారు. 500 ఏళ్ల తర్వాత అయోధ్య గుడి నిర్మాణంతో రాముడు వాపసు వస్తున్నారని అన్నారు. బాబ్రీ మసీద్ స్థలంలో ఆసుపత్రి కట్టాలని సెక్యులర్ పార్టీల నేతలు డిమాండ్ చేయాలన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ కథ ఇక క్లోజ్ అని ఎంపీ అన్నారు. ఎమ్మెల్సీ కవిత విషయంలో ఈడీ తమ పని తాను చేసుకువెళ్తుందన్నారు. మళ్లీ నోటీసులు కూడా ఈడీ నుంచి ఆమెకు రావచ్చని అన్నారు. రాబోయే రోజుల్లో పసుపు రైతులకు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ సీజన్‌లో పసుపు ధర 10వేలకు తగ్గదన్నారు సమావేశంలో ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్య నారాయణ, జిల్లా అధ్యక్షుడు బస్వలక్ష్మినర్సయ్య, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, దినేష్, న్యాలం రాజుతో పాటు ఇతర నేతలు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా దినేష్‌కులాచారి

- బస్వ లక్ష్మినర్సయ్యకు రాష్ట్ర స్థాయిలో అవకాశం
- పార్లమెంట్ ఎన్నికలపై బీజేపీ దృష్టి
- పార్టీ బలోపేతంపై పలు జిల్లాల అధ్యక్షుల మార్పు



దినేష్‌కులాచారి

నిజామాబాద్ అర్బన్, జనవరి 18: బీజేపీ అధిష్ఠానం క్షేత్ర స్థాయిపై నజర్ పెట్టింది. పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మరింత బలోపేతం అయ్యేందుకు జిల్లా అధ్యక్షులను మార్చింది. నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడిగా కులాచారి దినేష్‌ను నియమించింది. ఈ మేరకు పార్టీ నేతలు ఆయనకు ఫోన్ ద్వారా సమాచారాన్ని అందించారు. కొత్త జిల్లా అధ్యక్షులు కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు అన్ని నియోజకవర్గాల్లో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని ఆదేశాలను ఇచ్చింది. ప్రస్తుతం జిల్లా అధ్యక్షునిగా పనిచేస్తున్న బస్వ లక్ష్మినర్సయ్యను మార్చింది. ఆయనకు రాష్ట్ర కార్యవర్గంలో అవకాశం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. జిల్లా అధ్యక్షునిగా నాలుగేళ్లుగా బస్వలక్ష్మినర్సయ్య పనిచేస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఎంపీ అరవింద్‌తో కలిసి పనిచేశారు. ఆ ఎన్నికల్లో విజయం సాధించారు. గత కొంత కాలంగా ఎంపీ అరవింద్‌కు ఆయనకు మధ్య దూరం పెరిగింది. శాసనసభ ఎన్నికల సమయంలో కలిసి పనిచేసిన దూరం తగ్గలేదు. పార్లమెంట్ ఎన్నికలు వస్తున్న సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని జిల్లాలోని అధ్యక్షులను పార్టీ అధిష్ఠానం మారుస్తూ నిర్ణయం తీసుకుంది. దాంట్లో భాగంగానే జిల్లా అధ్యక్షుడిని మార్చింది. జిల్లా అధ్యక్షుడిగా నియామకమైన దినేష్‌కులాచారి శాసనసభ ఎన్నికల్లో నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. గణనీయంగా ఓట్లు సాధించారు. జిల్లా అధ్యక్షునిగా ఆయనకు అయ్యే అవకాశాన్ని పార్టీ అధిష్ఠానం ఇచ్చింది. నిజామాబాద్ పెద్ద జిల్లా కావడం పార్లమెంట్ పరిధిలో ఐదు నియోజకవర్గాలు ఉండటం ఎంపీతో కలిసి పనిచేసే అవకాశం ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. బస్వలక్ష్మినర్సయ్య అధ్యక్షునిగా ఇద్దరు ఎమ్మెల్యేలు గెలవడంతో పాటు మూడు నియోజకవర్గాల్లో గణనీయమైన ఓట్లను సాధించారు. డిపాజిట్లను కూడా దక్కించుకున్నారు. అధ్యక్షుని మార్పుపై గడిచిన మూడు నెలలుగా చర్చలు జరుగుతుండగా ప్రస్తుతం రాష్ట్ర నాయకత్వం ప్రకటనతో కొత్త అధ్యక్షుని నియామకం జరిగింది.

చేసిన పనులకు మళ్లీ శంకుస్థాపనలపై
కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాజిరెడ్డి గోవర్ధన్

నిజామాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో అనుమతులిచ్చి శంకుస్థాపనలు చేసిన పనులకు మళ్లీ శంకుస్థాపనలు చేస్తున్నారని జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ గురువారం ఫిర్యాదు చేశారు. అప్పటి ప్రభుత్వ హయాంలో టెండర్లు పూర్తిచేసి అగ్రిమెంట్లు చేసుకొని ప్రోటోకాల్ ప్రకారం శిలా ఫలకాలను ఏర్పాటు చేశారన్నారు. ప్రభుత్వం మారి కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆదేశాలతో మళ్లీ అవే పనులకు శంకుస్థాపనలు చేస్తున్నారని, వీటిని ఆపాలని ఆయన ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. నిజామాబాద్, ధర్పల్లి ప్రధాన రోడ్డులో వెంగల్‌పాడ్ గ్రామం వద్ద మొరగువాగుపై గత సంవత్సరం అక్టోబర్ 6న శంకుస్థాపన హైలెవల్ బ్రిడ్జి కోసం చేశామన్నారు. అదేరోజు లింగాపూర్ వాగు హైలెవల్ బ్రిడ్జి, వాడి గ్రామం వద్ద ముత్యాలవాగు పై హైలెవల్ బ్రిడ్జి, గడ్కోల్ గ్రామం వద్ద కప్పలవాగుపై హైలెవల్ బ్రిడ్జికు శంకుస్థాపనలు చేశామన్నారు. వీటికి మళ్లీ శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని నిబంధనలు ఉల్లంఘించడమేనని ఆయన జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన వాడి సర్పంచ్



ఎమ్మెల్యే భూపతిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న వాడి సర్పంచ్

ధర్పల్లి, జనవరి 18 : నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి సమక్షంలో గురువారం సాయంత్రం మండలంలోని వాడి సర్పంచ్ భాగవ్వ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆమెతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, వార్డు సభ్యులు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ కండువా వేసి స్వాగతం పలికారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఆరు గ్యారంటీ పథకాలను వంద రోజుల్లో అమలు చేస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాజీ సర్పంచ్ బేల్దారి కృష్ణ, ఒన్నాజిపేట్ సర్పంచ్ భగవంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి హామీ సోషల్ ఆడిట్ వివరాలు సమర్పించాలి'

డిచ్‌పల్లి, జనవరి 18: మండంలో 34గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనుల తాలూకు టీఏ, ఎఫ్ఏ, ఈసీ లు సభ్యులందరు సోషల్ ఆడిట్ వివరాలు తక్షణమే సంబంధిత శాఖ అధికారులకు అందజేసి వివరాలు చెప్పాలని అంబుడ్స్ మ్యాన్ శ్రీనివాస్ సూచించారు. గురువారం డిచ్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ ఏపీడీ ఒంపాల్ తో కలిసి అంబుడ్స్ మ్యాన్‌సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధిహామీ సిబ్బంది సోషల్ ఆడిట్ ,స్పార సబ్‌మిషన్ వివరాలు సకాలంలో అందించి అధికారులకు సహకరించలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో సుధాకర్‌రెడ్డి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్కొండ మైనారిటీ పాఠశాలలో ..

ముప్కాల్, జనవరి18: బాల్కొండ మైనారిటీ పాఠశాలలో ఐదవ తరగతి ప్రవేశం కొరకు 30మైనారిటీ సీట్లు అందుబాటులో ఉన్నాయని, అర్హులైన విద్యార్థులు 8, 9తరగతులకు దరఖాస్తులు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ వాణి తెలిపారు. పాఠశాలలో అన్ని సౌకర్యాలతో కూడిన అందించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతీఒక్కరు ఉపయోగించుకోవాలని ఆమె కోరారు.

గాంధీనగర్, ఆశాజ్యోతి కాలనీలలో గ్రామసభలు

నవీపేట, జనవరి 18 : మండలంలోని గాంధీనగర్, ఆశాజ్యోతి కాలనీలలో గురువారం గ్రామసభలు నిర్వహించారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రకు సంబంధించిన గ్రామసభలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. డ్రోన్ ద్వారా రసాయన ఎరువులు పంట పొలాలకు పిచికారి చేసే విధానాన్ని రైతులకు ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఎంపీవో రామకృష్ణ, ఏపీఎం భూమేష్ గౌడ్, పంచాయతీ రాజ్ ఏఈ శ్రావణ్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాము, మెడికల్ ఆఫీసర్ సామ్రాట్ యాదవ్, గాంధీనగర్ సర్పంచ్ మచ్చ ఆదిలక్ష్మి, బినోల ఎంపీటీసీ పద్మ, తదితరులున్నారు.

సాహిత్యంలో బహుమతులు గెలుపొందిన తడపాకల్ విద్యార్థులు



బహుమతులు గెలుపొందిన తడపాకల్ విద్యార్థులు

ఏర్గట్ల, జనవరి 18: మండలంలోని తడపాకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు డేగల వైష్ణవి రాసిన బంగారు బాల్యం కవితకు మొదటి బహుమతి అలాగే శ్రీజా పట్టుదల అనే కథకు ద్వితీయ బహుమతి పొందగా, శ్రీలేఖ రాసిన తెలుగు భాష అనే కవితకు ద్వితీయ బహుమతి లభించిందని తెలుగు పండితుడు ప్రవీణ్‌శర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెనడాదేశం నుంచి నిర్వహించే అంతర్జాతీయ మాసపత్రిక గడుగ్గాయి వారు సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన కథల పోటీలో అంతర్జాతీయ స్థాయిలో బహుమతులు గెలుపొందినట్లు ఆయన తెలిపారు. అనంతరం విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందనలు తెలిపారు.

జెండా బాలాజీ మందిర శుద్ధీకరణ కార్యక్రమం

ఆర్మూర్‌టౌన్, జనవరి18: పట్టణంలోని జెండాబాలాజీ మందిర ఆవరణను బీజేపీ ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛ తీర్థ మహా అభియాన్ కార్యక్రమంలో భాగంగా మందిర శుద్ధికరణ నిర్వహించారు. ఈ నెల 22న అయోధ్యలో శ్రీరామచంద్రుని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా దేశప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు తమ గ్రామంలో ఉన్న దేవాలయాలను శుభ్రం పరిచినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ.నర్సింహరెడ్డి, అధికార ప్రతినిధి జెస్సు అనిల్, ఓబీసీమోర్చ జిల్లా అధ్యక్షుడు యామాద్రిబాస్కర్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ కంచెట్టి గంగాధర్, నూతుల శ్రీనివాస్, పొల్కం వేణు, పులి యుగందర్, బాశెట్టి రాజ్‌కుమార్, కార్తికసింగ్, ఉదయ్‌గౌడ్, కిరణ్, రాము, పల్లె శ్రీనివాస్, రవి, శివ, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

బోంకన్‌పల్లి వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

మాక్లూర్, జనవరి18: మాక్లూర్ మండలం బోంకపల్లి గ్రామంలో గురువారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జడ్పీఛైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. అనంతరం ముల్లంగి, బోంకన్‌పల్లి లిఫ్ట్ పనులను జడ్పీఛైర్మన్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పద్మ, ఎంపీటీసీ పూజిత, ఎంపీడీవో క్రాంతి, ముల్లంగి ఉపసర్పంచ్ శ్యామ్‌రావు, ఏపీఎం అనిల్, నాయకులు రమణరావు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

బర్కత్‌పుర, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా బోధన్‌కు చెందిన మహమ్మద్ షరీఫ్(35) భార్య, కుమార్తెతో కలిసి పాత బస్తీ శాలిబండలో నివసిస్తూ శుభకార్యాలలో మటన్ కట్ చేస్తూ జీవిస్తున్నాడు. ఐదు నెలల క్రితం భార్య పుట్టింటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న షరీఫ్ ఇంటికి అద్దె కట్టలేకపోవడంతో జీవితంపై విరక్తి చెందాడు. గురువారం శివరాంపల్లి-ఫలక్‌నూమ రైల్వే స్టేషన్ల మధ్య రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి నాలుగు రోజుల జైలు

నిజామాబాద్ లీగల్, జనవరి 18: మద్యం సేవించి వాహనాన్ని నడిపిన షేక్ అన్వర్, కొన్నె మహేందర్‌లకు స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ సయ్యద్ ఖాదీర్ 4రోజుల జైలుశిక్ష విధిస్తూ గురువారం తీర్పుచెప్పారు.... వివరాల్లోకి వెళితే గాంధీ చౌక్‌లో పోలీసు వారు నిర్వహించిన వాహనాల తనిఖీలో భాగంగా వీరు మద్యం సేవించి నడుపుతున్నప్పుడు వారిని పరీక్షించగా మద్యం సేవించినట్లు నిర్ధారించిన పత్రాలను కోర్టులో దాఖలు చేయగా కోర్టులో వారు నేరాన్ని అంగీకరిం చడంతో 4రోజుల జైలుశిక్ష విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పు చెప్పారు.

వరదకాలువ నీటి నిలిపివేత

ముప్కాల్, జనవరి 18 : శ్రీరాంసాగర్ ప్రధాన కాలువలో ఒకటైన వరదకాలువకు గురువారం నీటి విడుదల నిలిపివేసినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. యాసంగి పంట సాగు కోసం మూడు వేల క్యూసెక్కుల నీటిని వదిలారు. ఇరిగేషన్ అధికారుల ఆదేశాలతో హెడ్‌రెగ్యులేటర్ నీటిని నిలిపివేసినట్లు వారు పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు (90.31టీఎంసీ)లు కాగా గురువారం సాయంత్రానికి ప్రాజెక్టులో (1082.50) అడుగులు కాగా (59.49టీఎంసీ)ల నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

బాల్కొండలో పేకాటరాయుళ్ల అరెస్టు

ముప్కాల్, జనవరి18: బాల్కొండ మండల కేంద్రంలోని అంతర్‌గల్లీలో పేకాట ఆడుతున్న నలుగురు పేకాట రాయుళ్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోపి తెలిపారు. వారి వద్ద నుంచి రూ.5420 నగదు స్వాధీనం చేసుకొని, వారి అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై గోపి తెలిపారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు

జక్రాన్‌పల్లి, జనవరి18: మండలంలోని అర్గుల్ గ్రామంలో మాజీ జడ్పీటీసీ సూర్యసురేష్ తల్లి సూర్య నర్సుబాయి అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం అర్గుల్ గ్రామంలో సూర్య నర్సుబాయి అంత్యక్రియలలో మాజీమంత్రి మండవ వెంకటేశ్వర్‌రావు, మాజీఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌లు పాల్గొన్నారు. అనంతరం మాజీ జడ్పీటీసీ సూర్యసురేష్‌ను, కుటుంబసభ్యులను మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర్‌రావు, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌లు పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ అంత్యక్రియల్లో ఎంపీపీ కుంచాల విమల రాజు, వైస్‌ఎంపీపీ తిరుపతిరెడ్డి, స్థానిక సర్పంచ్ గోర్త పద్మ, ఉప సర్పంచ్ గోర్త రాజేందర్, వీడీసీఛైర్మన్ రాజారెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు బోజన్న, దికొండ శ్రీనివాస్, మండల కోఆప్షన్‌సభ్యుడు అక్బర్‌ఖాన్, వివిధ పార్టీల నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఈనెల 20న నవోదయ పరీక్ష

ఖిల్లా, జనవరి 18 : ఈనెల 20న నవోదయ పరీక్ష జరుగుతుందని ఈ పరీక్ష కోసం భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు నగర పోలీస్ కమీషనర్ కల్మేశ్వర్ సింగనెవార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్ష ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు 13 సెంటర్లలో జరుగుతుందని తెలిపారు. కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష సమయంలో అన్ని జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని ఆదేశాలను ఇచ్చారు. సంబంధిత కేంద్రాల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్‌హెచ్‌వోలు పర్యవేక్షించాలని ఆదేశాలను ఆయన ఇచ్చారు.

నీలా దర్గాలో చాదర్ సమర్పణ



దర్గాలో చాదర్ సమర్పిస్తున్న నారాయణఖేడ్ ఎమ్మెల్యే

రెంజల్,జనవరి18:మండలంలోని నీలా గ్రామంలో గల సైలాని బాబా దర్గాను నారాయణ ఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్‌రెడ్డి సందర్శించి దర్గాలో చాదర్‌ను సమర్పించారు. ఆయనకు దర్గా నిర్వాహకుడు వహీద్ ఘనంగా సన్మానించారు. నీలా గ్రామంలోని సైలాని బాబా దర్గాను దర్శించుకోవడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. సైలాని బాబా దర్గా విశిష్టతను తెలుసుకుని దర్గాకు వచ్చి చాదర్‌ను సమర్పించడం జరిగిందని ఆయన అన్నారు. ఆయన వెంట గాయసోద్దీన్, షబాజ్, సర్ధార్ ఖాన్ తదితరులున్నారు.

శ్రీరామ ప్రసాద లడ్డును స్వాగతించిన ట్రస్టు సభ్యులు

ఆర్మూర్‌రూరల్, జనవరి18: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో పెర్కిట్‌లో గురువారం శ్రీరామ ప్రసాద లడ్డును అయోధ్య తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు స్వాగతించారు. హైదరాబాద్‌లో రామ భక్తుడు చేయించిన 1100కిలోల లడ్డు హైదరాబాద్ నుంచి అయోధ్యకు తీసుకువెళ్తుండగా పెర్కిట్‌లో అయోధ్య తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు స్వాగతించి పెర్కిట్‌లోని శివాలయం వరకు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాలెపు రాజు ద్యాగ ఉదయ్, రాస రాము, అయోధ్య తీర్థ క్షేత్ర ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో మండల పూజ

డొంకేశ్వర్, జనవరి18: డొంకేశ్వర్ మండలం సిర్పూర్ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గురువారం పెద్దమ్మతల్లి విగ్రహాన్ని ప్రతిష్టించి 41రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా మండల పూజ కార్యక్రమాన్ని సంఘ సభ్యులు నిర్వహించారు.సంకల్పం, గణపతి,గౌరీపూజ, అమ్మవారి పంచామృతలతో అభిషేకం,హారతి,మంత్రపుష్పం, ప్రసాదవితరణ వంటికార్యక్రమాలు నిర్వ హించినట్టు శేఖర్ పంతులు తెలిపారు. అనంతరం వచ్చినటువంటి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులుఅధిక సంఖ్యలోపాల్గొని అమ్మ వారికి దర్శించుకున్నారు.ఈకార్యక్రమంలో ముదిరాజ్‌సంఘసభ్యులు, పాల్గొన్నారు.

ముప్కాల్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

ముప్కాల్, జనవరి18: ముప్కాల్ మండల కేంద్రంలో సీసీకెమెరాల ఏర్పాటుకు సహకారం అందించాలని ముప్కాల్ ఎస్సై భాస్కరచారి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ముప్కాల్ పోలీస్‌స్టేషన్‌లో నేను సైతం కార్యక్రమంలో భాగంగా వ్యాపారస్తులతో సమావేశం ఏర్పాటు చేసిన ఆయన మాట్లాడుతూ నేర నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతోగానో ఉపయోగపడుతాయని, సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ముప్కాల్ వ్యాపార యాజమానులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ రికవరీ చేసిన రైల్వే పోలీసులు

ఖిల్లా, జనవరి 18: నిజామాబాద్ రైల్వే స్టేషన్ ఫాట్‌ఫామ్‌పైన ఒక వ్యక్తికి చెందిన సెల్‌ఫోన్ ఈనెల 17న అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తి ఎత్తుకొని పారిపోగా పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకొని ఫోన్‌ను రికవరీ చేశారు. నిందితుడు పిల్లిసాగర్‌గా రైల్వే ఎస్‌హెచ్‌వో ఓ.సాయిరెడ్డి తెలిపారు. ఈ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. దర్యాప్తులో సిబ్బంది హన్మాండ్లు, రవికిరణ్, రాములు, సీన ఆయన అభినందించారు.

టీయూ నూతన సంవత్సర క్యాలండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్

డిచ్‌పల్లి, జనవరి 18: తెలంగాణ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ బుర్రవెంకటేశం ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరి 2024 నూతనసంవత్సర క్యాలండర్ గురువారం రిజిస్ట్రార్ చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈసందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ.. అధ్యాపకులు క్రమశిక్షణ తో పనిచేస్తు బోధనలో, పరిశోధనలో వర్సిటీని తెలంగాణ లోనే అగ్రగామి గా నిలపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పబ్లికేషన్ సెల్ డైరెక్టర్ సత్యనారాయణ, ప్రొ.ఆరతి, డా.ప్రసన్న రాణి, ప్రొ.ఘంట చంద్రశేఖర్, అంతర్గాత పాలకమండలి సభ్యులు ప్రొ.నసీం, రవీందర్‌రెడ్డి, డీన్స్‌ప్రొ.త్రివేణి, ప్రొ.రాంబాబు, ప్రొ.అంజనేయులు, డా.పున్నయ్య, డా.మహేంద్, డా.అపర్ణ, పాల్గొన్నారు.

● ఎస్‌బీఐ క్యాలండర్‌ను ఆవిష్కరించిన టీయూ రిజిస్ట్రార్

ఎస్‌బీఐ (స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) తెలంగాణ యూనివర్సిటీ శాఖ 2024 నూతన సంవత్సర క్యాలండర్, మరియు డైరీలను టీయూ రిజిస్ట్రార్ ప్రొ యాదగిరి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ నూనవత్ కిషన్ సింగ్, సీనియర్ అసోసియేట్ రాథోడ్ రవీందర్, తదితరులు ఉన్నారు.

బెల్టు షాపులో అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

● తమకు న్యాయం చేయాలని మృతదేహంతో కుటుంబీకుల ఆందోళన

● గంటపాటు నిలిచిపోయిన వాహనాలు



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న పోలీసులు

నవీపేట, జనవరి 18 : నవీపేటలోని ప్రధాన చౌరస్తాలో గల బెల్టు షాపులో గురువారం డాంకే సాయిలు(62)అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం ఉద్రిక్త పరిస్థితికి దారి తీసింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని దర్యాపూర్‌కు చెందిన డాంకే సాయిలు గురువారం చాంద్ పాషా అనే మిత్రుడితో కలిసి నవీపేటలోని బెల్టు షాపులో మద్యం తాగేందుకు వెళ్లాడు. అరగంట తర్వాత బెల్టు షాపు నిర్వాహకుడు సంజీవరెడ్డితో పాటు మరో ఇద్దరు వ్యక్తులు కలిసి సాయిలును బెల్టు షాపు నుండి బయటకు మోసుకొచ్చి ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం ఎదుట పడుకోబెట్టి వెళ్లిపోయారు. సాయిలు తలకు బలమైన గాయం ఉండగా.. తలకు చుట్టుకున్న టవాల్ రక్తంతో తడిసిపోయి ఉంది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో సాయిలును కుటుంబ సభ్యులు నవీపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందాడు. వెంటనే బాధిత కుటుంబ సభ్యులు ఘటనా స్థలికి వచ్చి బెల్టు షాపు యజమాని సంజీవ రెడ్డిని నిలదీశారు. సాయిలు మృతికి కారణం ఏంటని ప్రశ్నించగా.. అతడు మెట్ల పై నుంచి పడిపోవడంతో గాయపడ్డాడని సమాధానం ఇచ్చాడు. దీంతో మృతుడి కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయిలు వద్ద పొలంలో కూలీలకు చెల్లించడానికి 8వేల రూపాయల నగదు ఉందని, మృతుడి వద్ద ఆ నగదు లభించలేదన్నారు. సాయిలును బెల్టు షాపు నుండి బయటకు మోసుకొచ్చి ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం ఎదుట పడుకోబెట్టిన దృశ్యాలు సీసీ కెమెరాలో నిక్షిప్తమయ్యాయని తెలిపారు. ఘటనకు సంజీవ రెడ్డి బాధ్యత వహించాలని, వెంటనే తమకు నష్ట పరిహారం అందించి న్యాయం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాత నవీపేట ప్రధాన రహదారిపై సాయిలు మృతదేహన్ని రోడ్డు పై ఉంచి గంటపాటు రాస్తారోకో నిర్వహించారు. దీంతో సమాచారం అందుకున్న నిజామాబాద్ సౌత్ రూరల్ సీఐ వెంకట నారాయణ ఘటనా స్థలికి చేరుకొని మృతుడి కుటుంబీకులను సముదాయించారు. బెల్టు షాపు నిర్వాహకుడు సంజీవ రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. కాగా.. సాయిలుతో కలిసి మద్యం తాగడానికి వెళ్లిన చాంద్ పాషా సంఘటన స్థలం నుంచి పారిపోయాడు. ఈ క్రమంలో ఘటనలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని సీఐ వెంకట నారాయణ తెలిపారు.

సొంతింటి కల నెరవేరేనా?

● నందిపేట, మాక్లూర్ మండలాల్లో డబుల్ బెడ్‌రూంల నిర్మాణాలను ఇంకా ప్రారంభించని అధికారులు

● కానరాని రోడ్లు, సెప్టిక్ ట్యాంకుల నిర్మాణం, ఇతర మౌలిక వసతులు



పెర్కిట్‌లో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు ఇలా..





అంకాపూర్‌లో వివిధ దశల్లో నిలిచి పోయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవే..

ఆర్మూర్‌రూరల్, జనవరి 18:గత ప్రభుత్వంబడుగు, బలహీనవర్గాల ప్రజలకు సొంతింటి సౌకర్యం కల్పించాలని రెండు పడక గదుల ఇళ్లను నిర్మించి ఇస్తామని వాగ్దానం చేసింది. అప్పటి సీఎం కేసీఆర్ అర్హులైన వారం దరికి డబుల్‌బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. అనేక గ్రామాలలో డబుల్ బెడ్‌రూంల ఇళ్ల నిర్మాణాలకు నోచుకోలేదు. ఆర్మూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలలో సుమారు రెండు వేలకు పైగా డబుల్ బెడ్‌రూం ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. నందిపేట, మాక్లూర్ మండలాల్లో డబుల్‌బెడ్‌రూంల నిర్మాణాలను ప్రారంభించలేదు.

● నాలుగు గ్రామాల్లోనే..

ఆర్మూర్ మండలంలోని నాలుగు గ్రామాల్లోనే రెండు పడక గదుల నిర్మాణాలను ప్రారంభించారు. ఆర్మూర్ పట్టణంతో పాటు పెర్కిట్, మామిడిపల్లి, అంకాపూర్ గ్రామాలలో డబుల్‌బెడ్‌రూంల ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించారు. ఆర్మూర్ పట్టణంలో 160రెండు పడక గదుల నిర్మాణాలకు శ్రీకారం చుట్టగా, అందులో 136ఇళ్లు దాదాపు పూర్తి కావొచ్చింది. కొంత మేరకుమౌలిక వసతులు కల్పించాల్సి ఉంది. మామిడిపల్లిలో వంద ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించగా ఇక్కడ కూడా పనులు పూర్తిఅయి,రోడ్లు,సెప్టిక్ ట్యాంకుల నిర్మాణం, ఇతర మౌలిక వసతులు పూర్తి చేయాల్సిఉంది. అంకా పూర్ గ్రామంలో 165ఇళ్లు నిర్మించాలని సంకల్పించి ప్రారంభించగా 112 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. పెర్కిట్‌లో వంద ఇళ్ల నిర్మాణం ప్రారంభిం చగా ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యి చిన్నపాటి పనులు పూర్తి చేయాల్సి ఉంది.

● దరఖాస్తు చేసుకున్న వారి ఎదురుచూపులు

ఆర్మూర్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు. వారికి సొంతింటి కల ఎప్పుడు నెరవేరుతుందోనని ఆశతో ఉన్నారు. ఆరు నెలల క్రితం డబుల్‌బెడ్‌రూంల మంజూరుకు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు, నాయకులు సూచించడంతో గ్రామాలలో లబ్ధిదారులు అధిక సంఖ్యలో డబుల్‌బెడ్‌రూంలకు దరఖాస్తు చేసుకున్నారు. నియోజకవర్గంలోని నాలుగు గ్రామాలలోనే పనులు ప్రారంభించినప్పటికీ సొంతింటి కల నేరవేరుతుందన్న ఆశతో ప్రజలు దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఏ ఒక్క గ్రామంలో కూడా ఇళ్ల నిర్మాణం పనులు ముందుకు సాగలేదు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టింది. ఎన్నికల మేనిఫెస్టోలో అర్హులైన పేదలకు ఇంటి నిర్మాణాలకు రూ.5లక్షలు అందజేస్తామని హామీ ఇచ్చింది. ఇందిరమ్మ ఇళ్ల పేరిట ఇళ్లు లేని వారికి ఇంటి స్థలంతో పాటు రూ.5లక్షలు ఇళ్లు నిర్మించి ఇస్తామని ప్రచారం నిర్వహించారు. కొత్త ప్రభుత్వంలోనైనా తమ సొంతింటి సహకరానికి మోక్షం లభిస్తోందని లబ్ధిదారులు ఆశాభావంతో ఉన్నారు.

తెలంగాణ జన సమితి రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కామారెడ్డిటౌన్, జనవరి 18: తెలంగాణ జన సమితి రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు కుంబాల లక్ష్మన్‌యాదవ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద పోస్టర్‌లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు కొదండరాం ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహించడం జరుగుతుందని తెలి పారు. తెలంగాణ రాష్ట్ర విభజన హామీలు తక్షణమే అమలయ్యే విధంగా కేంద్ర ప్రభు త్వంపై ఆ సదస్సులో ఒత్తిడి తెచ్చే విధంగా చర్చ జరపనున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రాంత అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఈ 10సం వత్సరాల కాలంలో ఒక్కటి అమలుచేయక తెలంగాణ ప్రాంతం పట్ల వివక్ష చూపుతున్నందున తక్షణమే అమలు చేసి కేంద్ర ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. విభజన హామీల అమలు కోసం తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో ఈనెల 21న హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య భవన్‌లో నిర్వహించే సమావేశానికి ఉద్యమ కారులు, మేధావులు, తెలంగాణవాదులు, ప్రజలు, జర్నలిస్టులు, విద్యార్థులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, రాజేందర్, టీజేఎస్ నాయకులు వివేక్‌యాదవ్,రాజు,దినేష్‌కువూర్,విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో ముగిసిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు



జట్టుకు బహుమతి అందజేస్తున్న అతిథులు



మాట్లాడుతున్న ప్రాంతీయ అధికారిణి అలివేలు

ఆర్మూర్‌రూరల్, జనవరి18: ఆర్మూర్ పట్టణంలోని సాంఘీక సంక్షేమ బాలుర పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన 67వ స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు గురువారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి సాంఘీక సంక్షేమ విద్యాసంస్థ ప్రాంతీయ అధికారిణి అలివేలు హాజరై విజేతలకు ట్రోఫీ, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడాకారులు జాతీయస్థాయి పోటీలలో రాణించి తెలంగాణ రాష్ట్ర జట్టును ప్రథమ స్థానంలో నిలపాలని అన్నారు. క్రీడల్లో గెలుపు, ఓటమిలు సహజమేనని, గెలుపొందిన క్రీడాకారులు అదే స్ఫూర్తితో ముందుకు వెళ్ళాలని, ఓటమి చెందిన క్రీడాకారులు గెలుపు కోసం పట్టుదలతో కృషి చేయాలని సూచించారు. స్కూల్ గేమ్స్ కార్యదర్శి సంగీతరావు మాట్లాడుతూ వచ్చేనెల 3వ తేదీ న చత్తీస్‌ఘడ్‌లో జరగనున్న జాతీయ పోటీలలో రాష్ట్ర క్రీడాకారులు సత్తా చాటాలన్నారు. రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శోభన్ బాబు మాట్లాడుతూ.. సాఫ్ట్‌బాల్ జిల్లా క్రీడాకారులు క్రీడా కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం సంతోషకరమన్నారు. పోటీలలో బాలికల విభాగంలో నిజామాబాద జట్టు ప్రథమ స్థానంలో నిలవగా మహబూబ్‌నగర్ ద్వితీయ స్థానం, కరీంనగర్ 3వ స్థానంలో నిలిచాయి. బాలుర విభాగంలో ఆదిలాబాద్ జట్టు ప్రథమ బహుమతి సాధించగా, మెదక్ జట్టు ద్వితీయ స్థానంలో, నిజామాబాద్ జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ దుర్గారెడ్డి, జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, గంగా మోహన్, టోర్నీ ఆర్గనైజింగ్ మల్లేష్‌గౌడ్, యునిస్‌పాషా, నాగరాజు, సుద్దపల్లి, వేల్పూర్ పాఠశాలల ప్రిన్సిపాల్ గోదావరి, స్వప్న, వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూరల్‌లో మళ్లీ మొరం అక్రమ తవ్వకాలు

● మండలంలో పలు చోట్ల గుట్టుగా తవ్వకాలు ● జేసీబీలు, పొక్లెయినర్‌లతో దర్జాగా దందా ● పట్టించుకోని అధికారులు



మొరాన్ని తరలించడానికి సిద్ధంగా ఉన్న టిప్పర్లు



మొరం తవ్వకాలను నిర్వహిస్తున్న దృశ్యం

నిజామాబాద్‌రూరల్, జనవరి 18: రూరల్ మండలంలో మళ్లీ అక్రమ మొరం దందా గుట్టుగా సాగుతోంది. గత ప్రభుత్వం హయాం లో దర్జాగా మొరం తవ్వకాలు చేసి గుట్టలు గుల్లలు చేసినవారు తిరిగి మళ్లీ అక్రమ దందాకు తెరలేపారు. అధికార, విప పార్టీలకు చెందిన కొందరు నేతలు ఈ అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారు. గత కొద్ది రోజులుగా గాంధీనగర్, గుండారం, మల్కాపూర్ ప్రాంతాల్లో తవ్వకాలు నిర్వహిస్తున్నారు. జేసీబీలు, ప్రొక్లయినర్‌లతో గుట్టలను తవ్వుతున్నారు. వెంటది వెంట టిప్పర్ల ద్వారా వాటిని బయటకు తరలిస్తున్నారు. సంక్రాంతి పండుగకు ముందు నుంచి గుట్టుగా ఈ దందా కొనసాగుతోంది. స్థానిక నేతల సహకారంతో అక్రమంగా మొరం తవ్వకాలు చేపడుతున్నారు. గతంలో గుండారంలో మొరం తవ్వకాలు చేసినప్పుడు టిప్పర్‌కు వంద రూపాయల చొప్పున వీడీసీ వసూలు చేసింది. అప్పటి ప్రజాప్రతినిదుల అండతో స్థానిక ప్రజాప్రతినిదులే దగ్గరుండి మరీ అక్రమంగా వేల టిప్పర్ల మొరం తరలించారు. పోలీసు, రెవెన్యూ, మైనింగ్ అధికారులు అడ్డుచెప్పినా అక్రమ మొరం దందా ఆపలేదు. గుండారం గుట్ట నుంచి అక్రమంగా మొరం తరలించినవారినుంచి గుండారం వీడీసీ పెద్దలు టిప్పర్‌కు రూ.100 చొప్పున సంవత్సరం మొత్తం కలిపి వీడీసీ 18 లక్షల రూపాయలు వసూలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత అక్రమ మొరం దందాను తాత్కాలికంగా నిలిపివేశారు. మళ్లీ అక్రమ మొరం తవ్వకాలకు తెరలేపారు. తాజాగా రూరల్ పరిధిలోని గాంధీనగర్‌లో అటవీ ప్రాంతం సమీపంలో గత వారం రోజులుగా అక్రమంగా మొరం తవ్వుతున్నారు. ఈ తతంగాన్ని స్థానికులు పోలీసులు, రెవెన్యూ అధికారులకు చెప్పినా స్పందించలేదు. దాంతో కొందరు టాస్క్‌ఫోర్సు అధికారులకు ఫిర్యాదుచేశారు. దాంతో గురువారం మధ్యాహ్నం టాస్క్‌ఫోర్సు ఏసీపీ రాజశేఖర్ రాజు, సీఐ అంజయ్య బృందం మొరం తవ్వుతున్న ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. మొరం తవ్వుతున్న మూడు టిప్పర్లు, జేసీబీని సీజ్ చేశారు. అక్రమ మొరం తవ్వకానికి పాల్పడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని రూరల్ పోలీసులకు అప్పగించారు.

గడువు లోగా సీఎంఆర్ ధాన్యం అందించాలి

ముప్కాల్, జనవరి18: 2022-23సంవత్సరానికి సంబంధించిన ఖరీఫ్, రబీ కస్టం మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) గడువు లోగా ప్రభుత్వానికి అందించాలని బాల్కొండ తహసీల్దార్ శ్రీధర్ ఆదేశించారు. గురువారం బాల్కొండ మండలంలో ఉన్న కిసాన్‌నగర్, నాగాపూర్ గ్రామాలలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీ చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా యాజమానితో సమావేశమై నిర్దిష్ట గడువులోగా సీఎంఆర్ ధాన్యం సరఫరా చేయాలని సూచించారు. ఇప్పటికే ఆలస్యం జరిగిందని, త్వరితగతిన సరఫరా చేయాలని సూచించారు. ఆయన వెంట ఆర్ఐ రాఘవేందర్, రెవెన్యూ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్రీడా సమ్మేళనం

పెర్కిట్, జనవరి18: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆర్మూర్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో క్రీడా సమ్మేళనం నిర్వహించనున్నారని ఏబీవీపీ ఇందూర్ అధ్యక్షుడు గొడుగు వెంకట కృష్ణ తెలిపారు. స్వామి వివేకానంద 161వ జన్మదినం సందర్భంగా నిర్వహించే యువజనోత్సవాలలో భాగంగా 19నుంచి 21తేదీ వరకు నిర్వహించే క్రీడా సమ్మేళనంలో ఆర్మూర్‌అర్బన్‌లో ప్రభుత్వ ప్రైవేటు, జూనియర్, డిప్లొమా, ఒకేషనల్, డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల పట్ల నైపుణ్యం కృషి ఉండడం వల్ల శారీరక, మానసిక ఉల్లాసం ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ శాఖ సభ్యులు పాల్గొన్నారు.

31లోగా రేషన్‌కార్డుల ఈకేవైసీ పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీకాంత్

పెర్కిట్, జనవరి18: ఆర్మూర్ మండల రేషన్‌షాప్ డీలర్ల సమావేశం గురువారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ .శ్రీకాంత్ మాట్లాడుతూ మండలంలోని రేషన్ కార్డుదారులు యొక్క ఈకేవైసీ 72శాతం పూర్తయ్యిందని ఈనెల 31లోపల మొత్తం కార్డులు ఈకెవైసీ పూర్తి చేయాలని సమ్మేళనంలో తెలిపారు. రేషన్‌కార్డుల వారిగా విజిలెన్స్ కమిటీలు ఏర్పాటు చేసుకొని ప్రతీనెల సమావేశాలు నిర్వహించాలని రేషన్‌షాపులలో సమయ వేళలు పాటించాలని సరుకుల పంపిణీ సక్రమంగా చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ విజయ్‌కాంత్‌రావు, ఆర్ఐ అశోక్‌సింగ్, జూనియర్ సహయకులు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఏలేటి మహిపాల్‌రెడ్డికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఏలేటి అన్నపూర్ణమ్మ కుంటుబసభ్యులు

కమ్మర్‌పల్లి,జనవరి 18:ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీశాఖ మాజీ మంత్రి ఏలేటి మహిపాల్‌రెడ్డి 33వ వర్ధంతిని పురస్కరిం చుకుని ఆయన సతీమణి ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఏలేటి అన్నపూర్ణమ్మ, కుమారులు బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యులు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి, ఏలేటి నాగార్జున్‌రెడ్డిలతో కలిసి స్వగ్రామం చౌట్‌పల్లిశివారులోని ఆయన సమాధి వద్ద జ్యోతి వెలిగించి ప్రత్యేక పూజల్లో పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ.. కార్యకర్తలు తమ కుటుంబసభ్యుల మాదిరి నాటి నుంచి నేటివరకు వెన్నంటే ఉంటూ తమ కష్టసుఖాల్లో పాలు పంచుకున్నారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ నర్సింహారెడ్డి, బాల్కొండ అసెంబ్లీ కన్వీనర్ మల్కాన్నగారి మోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మలశ్రీనివాస్, భజరంగ్ పార్టీమండల అధ్యక్షుడు కట్ట సంజీవ్ పాల్గొన్నారు

మరియతండాలో భారత్ సంకల్పయాత్ర

ధర్పల్లి, జనవరి 18: మండలంలోని మరియతండాలో భారత్ సంకల్ప యాత్రను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ సంక్షేమ పథకాలను డిజిటల్ రూపంలో ప్రజలకు వివరించారు. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీవో లక్ష్మణ్, ఎంపీవో, కార్యదర్శి పాల్గొన్నారు.

పొతంగల్ సహకార సంఘ పాలకవర్గాన్ని రద్దు చేయాలని డీసీవోకు వినతి

కోటగిరి,జనవరి18: పొతంగల్ విశాల సహకార పరపతి సంఘం పాలకవర్గాన్ని రద్దు చేయడంతో పాటు విండో కార్యదర్శి భరత్‌ను తొలగించాలని సహకార సంఘ సభ్యులు డిమాండ్ చేశారు. డీసీవో సింహచలంను కలిసి గురువారం లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. పొతంగల్ సహకార సంఘ మహజన సభ సకాలంలో నిర్వహించకపోవడంతో సహ సంఘంలో పలు అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయని వారు ఫిర్యాదు చేశారు. ఇటీవల నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో సంఘ సభ్యులు ఏకగ్రీవంగా పాలకవర్గాన్ని రద్దు చేయడంతో పాటు విండో కార్యదర్శిని తొలగించాలని ఏకగ్రీవంగా తీర్మానించినట్లు డీసీవోకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సంఘంలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ జరిపి కొత్త పాలకవర్గాన్ని నియమించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై డీసీవో స్పందించి సంఘం లావాదేవీల రికార్డులను సీజ్ చేసి విచారణ జరిపిస్తానని హామీ ఇచ్చారు. డీసీవో కలిసిన వారిలో సంఘ సభ్యులు సాదుల రమేష్, గోపాల్ రెడ్డి తదితరులున్నారు.



డీసీవోకు ఫిర్యాదు చేస్తున్న పొతంగల్ సహకార సంఘ సభ్యులు

జిల్లా అంతటా ఎన్టీఆర్ వర్ధంతి



బోధన్‌లో ఎన్టీఆర్ వర్ధంతి దృశ్యం



నగరంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న టీడీపీ నాయకులు



కమలాపూర్‌లో ఎన్‌టీఆర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

బోధన్‌రూరల్, జనవరి 18: దివంగత నందమూరి తారక రామారావు 28వ వర్ధంతిని గురువారం ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకులు ఘన నివాళి అర్పించారు.ఈ సందర్భంగా మండలంలోని పెంటా ఖుర్దు, జాడి జమాల్‌పూర్, ఎరాజ్‌పల్లి తదితర గ్రామాల్లోని ఎన్టీఆర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణ శివారులోని కమ్మ సంఘం భవనంలో మెగా రక్తదాన శిబిరం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ తూము పద్మ శరత్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగు వారి ఆత్మ గౌరవానికి ప్రతీక నంద మూరి తారక రామారావు అని, ప్రపంచ వ్యాప్తంగా తెలుగుకు వెలుగు లద్దిన దివిటి అనిఎన్టీరామారావు చేసిన సేవలను కొనియాడారు. ఆయన వర్ధంతి సందర్భంగా రక్తదానానికి అధిక సంఖ్యలో రావడం అభినందనీ యమన్నారు. రక్తదానం ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడుతుందని పేర్కొన్నారు. ఎన్టీఆర్ పటేల్, పట్వారీ వ్యవస్థను రద్దు చేశారని ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని, పేదల సంక్షేమానికి రూ. 2లకే కిలో బియ్యం వంటి అనేక పథకాలు తీసుకువచ్చారని గుర్తుచేశారు. ఈకార్యక్రమంలో ఎన్టీఆర్‌అభిమాన సంఘం నాయకులు శివన్నారాయణ, గాంధీ,రంగారావు,అప్పారావు, శ్రీనివాసరావు,శరత్‌రెడ్డి,డాక్టర్‌సునీల్ కుమార్ చౌదరి,వెంకటేశ్వరరావు,గంగారెడ్డి,శ్రీరామమూర్తి,సీహెచ్‌వీ హనుమంత రావు, శ్రీనివాసరావు, నాగేశ్వర్‌రావులతో పాటు తది తరులు పాల్గొన్నారు.

కోటగిరి: కోటగిరి మండల కేంద్రంలోని ఎన్‌టీఆర్ చౌరస్తాలో గురువారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎన్‌టీఆర్ చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టీఆర్ అభిమాన సంఘం నాయకులు రమేష్ బాబు, శ్రీధర్, వేముల పల్లి ఆనంద్, ఎత్తొండ నాగులు, ఉదయ భాస్కర్, చౌదరి, జానకిరావు, గోపాల్‌రావు, గోపి పాల్గొన్నారు.

సుభాష్‌నగర్: తెలుగుదేశం వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు వర్ధంతి వేడుకలను జిల్లా టీడీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ పార్లమెంటరి అధ్యక్షుడు దేగాం యాదగౌడ్ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం టీడీపీ పార్టీ కార్యాలయం నుంచి ధర్నా చౌక్ వరకు ర్యాలీగా వచ్చి ధర్నా చౌక్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దేగాం యాదగౌడ్ మాట్లాడుతూ తెలుగు వారి ఆశా జ్యోతి ఎన్టీఆర్ మనమధ్య లేకపోవడం పార్టీకి తెలుగు ప్రజలకు తీరనిలోటని అన్నారు. తెలుగు వారి ఖ్యాతిని ప్రపంచ నలుమూలలకు వ్యాప్తి చేసిన వ్యక్తి ఎన్టీఆర్ అని తెలుగు ప్రజలకు ఓనమాలు నేర్పిన వ్యక్తిగా చిరకాలం గుండెల్లో ఉంటారన్నారు. పటేల్, పట్వారీ వ్యవస్థను రద్దు చేసి మహిళ సాధికారికతను పెద్దపీట వేసి చెరగని ముద్ర వేశారన్నారు. అనంతరం దుబ్బా ప్రాంతంలో ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఇంచార్జి వినోద్‌కుమార్, అర్బన్ కోకన్వీనర్లు కోయెడనర్సింహులు, కల్లెడ గంగాధర్, పార్లమెంట్ కమిటి నాయకులు రేంజర్ల సురేష్,జ్యోతి నారాయణ,బీసీ సెల్ అధ్యక్షులు దంతాల ఆనంద్, మాజీ ఎంపిటిసి గోవర్ధన్, అర్బన్ నాయకులు లవంగరాజు, నర్సయ్య,లక్ష్మియాదవ్,సర్పరాజ్,రాములు,గంగసాగర్, గణేష్,సాయిలు,సలీం,ప్రభాకర్,గంగాధర్,మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని కమలాపూర్‌లో గురువారం తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపకులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌టీ రామారావు విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పేద ప్రజలకు ఆయన చేసిన సేవలు, అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉమా మహేశ్వర్‌రావు, నాగిరెడ్డి, బాబు, శ్రీనివాస్ రావు, మోకన్‌పల్లి సర్పంచ్ సుధాకర్, వెంకట్రామిరెడ్డి, సుబ్బారెడ్డి, యాదయ్య, సత్యానారాయణరెడ్డి తదితరులున్నారు.

మోపాల్: స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు వర్ధంతి గురువారం మండలంలోని మోపాల్, మాధవనగర్ గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాదవనగర్ సొసైటీ చైర్మన్ నాగేశ్వర్‌రావు, గ్రామస్థులు పాల్గొన్నారు. అలాగే మోపాల్‌లో మహాలక్ష్మి చికెన్ సెంటర్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రఘు, సుభాష్, మధు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్: బాల్కొండ మండలం వన్నెల్(బి) గ్రామంలో నందమూరి తారక రామారావు వర్ధంతిని ప్రజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సంస్కారణాలు, పేదప్రజలకు చేసిన సేవల గురించి కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాగులపల్లి రాజేశ్వర్, గాదేపల్లి రాజేంధర్, వెల్మరమేష్, మిట్టపల్లి నర్సారెడ్డి, ఎంపీటీసీ పాల్గొన్నారు.

రాములోరి సేవలో ఎంపీ ధర్మపురి, ఎమ్మెల్యే ధన్‌పాల్



ఖిల్లా దేవాలయంలో పూజలు చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్ అర్బన్, జనవరి 18: అయోధ్యలో జరిగే రామమందిరం పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని పురస్కరించుకొని నిజామాబాద్‌లోని చరిత్ర గల ఖిల్లా రామాలయంలో గురువారం శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అరవింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పాల్గొన్నారు. ఆలయాన్ని శుద్ధి చేశారు. అయోధ్యలో రామమందిర పునః నిర్మాణం హిందువుల కల అని అది ఈనెల 22న నెరవేరబోతుందని ఎంపీ అరవింద్, ధన్‌పాల్ సూర్యనారాయణలు అన్నారు. కరసేవలో ఎంతో మంది హిందువులు తమ ప్రాణాలను కోల్పోయారని ఆయన అన్నారు. హిందువుల కల ప్రస్తుతం నెరవేరుతుందని ఈనెల 22న అందరి ఇండ్లల్లో దీపాలు వెలిగించాలని కోరారు. ప్రతి హిందువు ఆలయంలో ఈనెల 22న అర్చనలు, అభిషేకాలు, హోమం వంటి కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బస్వలక్ష్మినర్సయ్య, నాయకులు నాగొళ్ల లక్ష్మినారాయణ, పోతన్‌కర్ లక్ష్మినారాయణ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గోపిడి స్రవంతిరెడ్డి, ప్రవళిక, మమత, కొండవీరశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మి నర్సింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు వేలం



ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సుప్రియ

ఎడపల్లి, జనవరి18: ఎడపల్లి మండలంలోని జానకంపేట గ్రామ శివారులో గల లక్ష్మి నర్సింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు గురువారం దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సుప్రియ వేలం నిర్వహించారు. ఈ వేలంలో కొబ్బరి కాయలు, పూజా సామగ్రి, నవ ధాన్యాల దుకాణం నిర్వహించేందుకు గాను లడ్డు, పులిహోర దుకాణంలకు నిజామాబాద్‌కు చెందిన జి.సురేష్ 43వేలు, 39 వేలకు దక్కించుకున్నారు. రాణాకలాన్ గ్రామానికి చెందిన జి.సురేష్ సైకిల్ స్టాండు నిర్వహించుటకు రూ.6800 లకు, అలాగే మందిరంలో రెండు సంవత్సరాల పాటు కొబ్బరి కాయలు, పూజా సామగ్రి, నవధాన్యాలు, లడ్డు, పులిహోర దుకాణం నిర్వహణకు నిజామాబాద్‌కు చెందిన డి.రాజు వేలంలో దక్కించుకున్నట్లు ఆమె తెలిపారు. అనంతరం రాణాకలాన్ గ్రామంలో గల ఆలయ భూముల నుంచి క్రింది ఆయకట్టుకు వెళ్లేందుకు రైతులు దారి కావాలని కోరడంతో ఆమె సానుకూలంగా స్పందించి పంట అనంతరం తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ ఛైర్మన్ తాళ్ల విజయ్ కుమార్‌గౌడ్, ఆలయ ఈఓ వేణు, జూనియర్ అసిస్టెంట్ రఘు, వ్యాపారులు ఉన్నారు.

జంగమ సమాజ్ కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బోధన్‌రూరల్, జనవరి 18: జంగమ సమాజ్ కులస్థులు అన్ని రంగాల్లో రాణించాలని, సమాజసేవలో ఆదర్శంగా నిలవాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. గురువారం ఎమ్మెల్యే స్వగృహంలో జంగం సమాజ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జంగమ సమాజ్ సభ్యులు సమ సమాజ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. జంగం సమాజ్ కులస్తు లకు కావాల్సిన అన్ని వసతులను కల్పిస్తామని హామీనిచ్చారు. ఈ సం దర్భంగా అందరికీ నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలి పారు. ఈకార్యక్రమంలో జంగమ సమాజ్ ప్రముఖులు పురాణే అజయ్ కుమార్, రాజేందర్ అప్పా, నర్సింగ్ అప్పా, బాబాయప్ప, విఠలప్ప, దిలిప్‌కుమార్, శివకుమార్ తదితరులు ఉన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు



పంట పొలాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి

బోధన్ రూరల్, జనవరి 18: రైతులకు సరిపడ ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజీద్ హుస్సేన్ అన్నారు. గురువారం బోధన్ మండలంలోని బెల్లాల్ తదితర గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో యాసంగికి సరిపడ ఎరువులు అందు బాటు లో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాల న్నారు. యాసంగిలో వ్యవసాయ విస్తీర్ణ అధి కారులు నమోదు చేసి పంట సర్వే నెంబర్లను, ఆ సర్వే నెంబర్లలో వే సిన పంటలను ర్యాండమ్‌గా సర్వే నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి, ఏఈవో తది తరులు పాల్గొన్నారు.

నేడు ఎడపల్లిలో ఎమ్మెల్యే పర్యటన

ఎడపల్లి, జనవరి18: ఎడపల్లి మండలంలో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి శుక్రవారం పర్యటిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షులు పులి శ్రీనివాస్ తెలిపారు. ఉదయం మండలంలోని జానకంపేట గ్రామ శివారులోని శ్రీ లక్ష్మి నర్సింహస్వామి ఆలయాన్ని సందర్శించిన అనంతరం రాణాకలాన్, కుర్నాపల్లి, మంగల్‌పాడ్, ఎడపల్లి, అంబం, బ్రాహ్మణ్ పల్లి, జైతాపూర్ గ్రామాలలో పర్యటించనున్నట్లు తెలిపారు.

రేపు ఉమ్మడి జిల్లా జూనియర్ బాల్ బాడ్మింటన్ ఎంపికలు

సుభాష్‌నగర్, జనవరి 18: జిల్లా కేంద్రంలో 68వ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జూనియర్ బాల్ బాడ్మింటన్ బాల బాలికల ఎంపికలు శనివారం నిర్వహిస్తున్నట్లు జిల్లా బాల్ బాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మానస గణేష్, శ్యామ్‌లు తెలిపారు. రెంజల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు 2-1-2004 తర్వాత పుట్టిన వారు ఉండాలన్నారు. ఈ పోటీలో ప్రతిభకనబర్చిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి ఎంపికలకు పంపనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఆధార్‌కార్డు వెంట తెచ్చుకోవాలని మిగతా వివరాల కోసం ఆర్గనైజింగ్ సెక్రెటరీ కృష్ణమూర్తి 9908463670 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

వర్ని,జనవరి18: చందూర్ మండల కేంద్రంకు చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. మాజీ వైస్ ఎంపీపీ కల్లూరి రాంరెడ్డి, అంబెపు సాయిరెడ్డి, అట్నల గంగాధర్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

కొత్త క్రేటా కారు ఆవిష్కరణ

నిజామాబాద్ అర్బన్, జనవరి 18: నగరంలోని ప్రకాశ్ హుండాయ్ షోరూంలో గురువారం హుండాయ్ క్రేటా కొత్త కారును ఎండీ నల్ల దినేష్‌రెడ్డి ఆవిష్కరించారు. అత్యాధునిక టెక్నాలజీకి సంబంధించిన ఎస్‌యూవీ క్యాడ్‌బిన్, ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్‌లు, హుండాయ్ స్మార్ట్‌సెన్స్ లెవల్-2 వంటి ఫీచర్లు కలిగి ఉన్న వాహనాన్ని కస్టమర్లకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ వాహనం 1.5ఎల్ టర్బోజీడీఐ పెట్రోల్ ఇంజన్‌తో శక్తివంతమైన పవర్ ట్రైనింగ్‌ను కలిగి ఉంది. నిజామాబాద్ జిల్లా ప్రజల కోసం ఈవాహనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఎండీ దినేష్‌రెడ్డి తెలిపారు. వాహనం రూ.11లక్షల నుంచి 20 లక్షల మధ్యలో అందుబాటులో ఉందని ఆయన తెలిపారు. మొదటి ఈ వాహనాన్ని గొట్టుముక్కలకు చెందిన ప్రవీణ్ యాదవ్‌కు అందజేశారు. కార్యక్రమంలో మేనేజర్ వినోద్, నితిన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



కొత్త క్రేటాకారును ఆవిష్కరిస్తున్న దృశ్యం

నిర్లక్ష్యం వహిస్తున్న 'నుడా'



ధర్మారం (బి) శివారులో డివైడర్‌మధ్యలో ఎండుతున్న మొక్కలు

డిచ్‌పల్లి,జనవరి 18:నిజామాబాద్‌అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(నుడా) ఆధ్వర్యంలో డిచ్‌పల్లి మండల కేంద్రం నుంచి బోర్గాం(పి) వరకు డివైడర్ లో మధ్యలో మొక్కలు నాటారు. వాటికి గత నెల రోజుల నుంచి నీరు పోయకపోవడంతో ఎండిపోతున్నాయి.దీంతో రోడ్డుమధ్యలో కలవిహీనంగా కనబడుతున్నాయి. నుడా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. లక్షల రూపాయల ఖర్చులు చేసి మొక్కలు నాటి వాటికి కనీసం నీరు అందించకపోవడం పై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

యువత ఒత్తిడికి గురి కావొద్దు : బల్వీర్ సింగ్

మోపాల్, జనవరి 18: యువత పదే పదే ఆలోచించడం వల్ల ఒత్తిడికి గురై అనారోగ్యాల బారిన పడుతున్నారని డాక్టర్ బల్వీర్‌సింగ్ అన్నారు. గత రెండు రోజుల నుంచి మండలంలోని మంచిప్ప గ్రామంలో జరిగిన వాలీబాల్ పోటీల ముగింపు కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి డాక్టర్ బల్వీర్‌సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత అధిక ఒత్తిడిలకు గురికావడం వల్ల మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువకులు ఆరోగ్యవంతంగా ఉండాలంటే క్రీడలు ఎంతో దోహదపడుతాయని తెలిపారు. గెలుపొందిన వాలీబాల్ క్రీడాకారులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిద్ధార్థ, ఉపసర్పంచ్ జగదీశ్, మాజీ ఎంపీటీసీ వెంకట్రామ్, యూత్ అధ్యక్షుడు సాయిరాం, వీడీసీ అధ్యక్షుడు నరేష్‌రెడ్డి, దేవేందర్, నవీన్, గంగాప్రసాద్, గౌతమ్, శ్రీకాంత్, ఆయా గ్రామాల క్రీడాకారులు పాల్గొన్నారు.

మొరం అక్రమ తవ్వకాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు

● టిప్పర్లు, జేసీబీ స్వాధీనం.. నలుగురి అరెస్టు

నిజామాబాద్ రూరల్, జనవరి 18: రూరల్ మండలం గాంధీనగర్ గ్రామ పంచాయతీ పరిధిలో అక్రమంగా మొరం తవ్వకాలపై టాస్క్‌ఫోర్సు అధికారులు దాడులు చేశారు. గురువారం మధ్యాహ్నం టాస్క్‌ఫోర్సు ఏసీపీ రాజశేఖర్ రాజు, సీఐ అంజయ్య బృందం మొరం తవ్వుతున్న అటవీ ప్రాంతంపై దాడులు చేశారు. మొరం తవ్వుతున్న మూడు టిప్పర్లు, జేసీబీని సీజ్ చేశారు. అక్రమ మొరం తవ్వకానికి పాల్పడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని రూరల్ పోలీసులకు అప్పగించారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్న ఎమ్మెల్యే

ఇందల్వాయి, జనవరి 18: ఇందల్వాయి మండలంలో పలు అభివృద్ధి పనులకు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేయనున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. మండలంలోని వెంగల్‌పాడ్ గ్రామంలో ఇందల్వాయి నుండి ధర్పల్లికి వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్‌కు వంతెనకు శంకుస్థాపన, ఎల్లారెడ్డిపల్లి గ్రామం వద్ద మరో వంతెనకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

డిచ్‌పల్లి: నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.రేకులపల్లి భూపతిరెడ్డి నేడు శుక్రవారం డిచ్‌పల్లి , ఇందల్వాయి, ధర్పల్లి, సిరికొండ మండలాల పరిధిలోని ఆర్ అండ్ బీ వంతెనల నిర్మాణానికి శంఖుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొంటారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు. నడిపల్లి గ్రామంలో జి కన్వెన్షన్ ఎదుట, వంతెన మరియు మెంటల్‌పాడ్ మొరుగు వాగు పై వంతెన, అనంతరం ఎల్లారెడ్డిపల్లి గ్రామంలో లింగపూర్ వాగుపై వంతెన, శంఖుస్థాపన చేసి వాడి గ్రామంలో ముత్యాల వాగు పై వంతెన, గడ్కోల్ కప్పలవాగు వంతెన శంఖుస్థాన కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు.

బెల్టుషాపు నిర్వాహకుడిపై కేసు

నవీపేట,జనవరి18: మండల కేంద్రంలో బెల్టు షాపు నిర్వహిస్తున్న సంజీవ రెడ్డి అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపారు.ఎటువంటి అనుమతులులేకుండా మద్యాన్నివిక్రయిస్తుండడంతో అతనిపై కేసునమోదుచేయడం జరిగిందన్నారు

నేడు మండల సర్వసభ్య సమావేశం

కోటగిరి,జనవరి18:కోటగిరిమండల పరిషత్‌సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ సునీత అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మనోహర్‌రెడ్డి తెలిపారు. ఈసమావేశానికి ఎంపీటీసీలు,సర్పంచ్‌లు, ఆయాశాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

గురుకుల ప్రవేశాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, జనవరి 18:ఉమ్మడి జిల్లాలోని మహాత్మ జ్యోతిభాపూలే గురుకుల పాఠశాలలో 6,7,8 తరగతుల ఖాళీ సీట్లలో ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని రీజినల్ కోఆర్డినేటర్ సత్యనాథ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సీట్ల భర్తీ 2024-25 సంవత్సరానికి తీసుకుంటారని ఆయన తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీలలో అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈనెల 20 వరకు గడువు ఉందని ఫిబ్రవరి 11న ప్రవేశపరీక్ష ఉంటుందని ఆయన తెలిపారు.

మైనారిటీ గురుకులాల్లో అడ్మిషన్లు ప్రారంభం

బోధన్‌రూరల్,జనవరి 18: బోధన్ పాండుఫారంలో గల తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ (బాలికల) స్కూల్ అండ్ కాలేజ్‌లలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, అర్హులైన విద్యార్థినులు దరఖాస్తులు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ పద్మజ తెలిపారు. గురువారం మైనారిటీ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మైనారిటీ గురుకుల పాఠశాలలో 2024-25 ఏడాదికి గాను 5వ తరగతి, కళాశాలనందు ఇంటర్మీడియట్ ఫస్టియర్ ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో అడ్మిషన్లు నేటి నుంచి ఫిబ్రవరి 6వ తేదీలోపు tmreies.cgg.gov.inవెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసు కోవాలని ఆమెతెలిపారు.6,7,8 తరగతుల మైనారిటీ విద్యార్థులకు చెందిన మిగులు సీట్లను కూడాభర్తీ చేస్తామని పేర్కొన్నారు.ఇతర వివరాలకు 9346138537,9948862811 నెంబరుకు సంప్రదించాలన్నారు.

కోటగిరి: కోటగిరి మైనారిటీ రెసిడెన్షియల్ బాలుర జూనియర్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరం ఫస్ట్ ఇయర్‌లో ఎంపీసీ, బైపీసీ ఇంగ్లీష్ మీడియంలో అడ్మిషన్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ మొబిన్ తెలిపారు. ఈ నెల 18 నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయని ఎలాంటి రుసుము లేకుండా ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ఉంటోందని ఆయన తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తు సమయంలో విద్యార్థి ఆధార్ కార్డు, ఫోటో, సంతకం తప్పనిసరిగా ఉండాలని సూచించారు. టీఎంఆర్ఈఐఎస్ మొబైల్ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. మైనారిటీ విద్యార్థులు ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ ప్రాతిపాదికన సీట్లు కేటాయిస్తామన్నారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

చికెన్ ధరలు





రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.130	రూ.200	రూ. 220
వెన్‌కాబ్(కిలో)	రూ.135	రూ.205	రూ. 225

బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.63,600	రూ.58,600	రూ.755


సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : హనుమాన్ (9.40, 1.00, 4.20, 7.40, 11.00)
స్క్రీన్-2 : హనుమాన్ (హిందీ) (12.00, 10.00)
: గుంటూరుకారం (3.20)
: హనుమాన్ (తెలుగు) (6.40)
స్క్రీన్-3 : గుంటూరుకారం (11.40, 6.20, 9.40)
: హనుమాన్ (హిందీ) (3.00)
స్క్రీన్-4 : నా సామిరంగ (12.40, 6.50, 10.00)
: సైంధవ్ (3.50)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : నా సామిరంగ (4.35, 10.45)
: గుంటూరుకారం (7.40)
స్క్రీన్-2 : గుంటూరుకారం (10.25, 4.20, 10.30)
: సైంధవ్ (1.30, 7.30)
స్క్రీన్-3 : హనుమాన్ (10.30, 1.30, 4.30, 7.35, 10.35)



దేవి : హనుమాన్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహోల్ : గుంటూరుకారం (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : నా సామిరంగ (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : సైంధవ్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్